
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025

కేటీఆర్ ఇచ్చే జీతాలు తీసుకుని
మాట్లాడుతున్నారు
● యూట్యూబ్ చానళ్లపై
ఎంపీ రఘునందన్ ఘాటు వ్యాఖ్యలు 7




హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో భవన్ వద్ద బతుకమ్మ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీఎన్జీవో భవన్ వద్ద బుధవారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీఎన్జీవో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ నాన్ గెజిటెడ్ మహిళా ఉద్యోగులతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి బతుకమ్మ ఆట.. పాట ఆడారు. మహిళా ఉద్యోగులకు కుంకుమ ఇచ్చి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



సద్దుల బతుకమ్మకు ఈసారీ నిరాశే!

తూప్రాన్ పట్టణంలో యేటా పెద్దచెరువు కట్టపై అత్యంత వైభవంగా జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలకు ఈసారి భారీ వర్షాలు ఆటంకం కలిగించాయి. ఎడతెరిపిలేని వర్షాలతో పెద్దచెరువు నిండి అలుగు పారుతూ, కట్టపైకి వెళ్లే దారి దెబ్బతిన్నది. ప్రతీ ఏడాది పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ ఆట కోసం వేలాది మంది మహిళలు చెరువు కట్టపైకి చేరుకుంటారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇక్కడ లైటింగ్, డీజే సిస్టమ్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ఈసారి ఆ వీలు లేక మహిళలు నిరాశ చెందుతున్నారు. మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి స్పందిస్తూ మహిళలు వీధుల్లోనే బతుకమ్మలు ఆడుకోవాలని, కేవలం నిమజ్జనం కోసం మాత్రమే చెరువు వద్దకు రావాలని కోరారు.

- తూప్రాన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి)


అన్నపూర్ణే మహాదేవి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం అమ్మవారు అన్నపూర్ణమాతగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో విశేష అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్ నెట్‌వర్క్



ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో..



చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి దుర్గామాత ఆలయంలో



గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు



సంగారెడ్డి పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌పేట దుర్గా భవాని మహాక్షేత్రంలో



జహీరాబాద్ సిద్దేశ్వరాలయంలో అమ్మవారు

ఈ నెల 12న కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్‌లో 48 ఏళ్ల ఓ మహిళ రహదారి వెంట వెళ్తున్న క్రమంలో కుక్కల గుంపు దాడి చేశాయి. పక్కనే ఉన్న కొందరు యువకులు కుక్కల మందను చెదరగొట్టడంతో ఆమె గాయాలతో బయటపడింది.

రెండు రోజుల క్రితం సంగారెడ్డిలోని శాంతినగర్‌కు చెందిన 9 ఏళ్ల ఓ బాలికపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. దీంతో ఆమె కాలికి గాయం కాగా, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది.

తాజాగా బుధవారం సంగారెడ్డిలోని రామ్‌నగర్‌కు చెందిన 40 ఏళ్ల ఓ వ్యక్తి వెంట కుక్కలు వెంటబడ్డాయి. ఆయన చేతిని కరవగా కాట్లు పడ్డాయి. స్థానిక జనరల్ ఆస్పత్రికి వెళ్లి రేబిస్ వ్యాక్సిన్ తీసుకున్నారు.

జిల్లాలో ఏదోఒక చోట కుక్కల దాడులు నిత్యకృత్యమైపోయాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోజూ 5 నుంచి 10కి తగ్గకుండా కుక్కకాటు కేసులు వస్తున్నాయంటే పరిస్థితి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంగారెడ్డి జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	కుక్కకాటు కేసులు
2021	1,543
2022	3,255
2023	2,520
2024	2,252
2025 (ఇప్పటివరకు)	1,697



సంగారెడ్డిలోని ఓ వీధిలో కుక్కల గుంపు

డేంజర్ డాగ్స్

వీధి కుక్కల స్వైర విహారం

చిన్నారులు, వృద్ధులపై పాశవికంగా దాడులు
వాహనదారులను వెంటపడి కరుస్తున్న శునకాలు
బయటికెళ్లాలంటే జనంలో వణుకు
వీధి కుక్కల నివారణలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాల కాలి పిక్కలు లాగేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా కుక్క కాట్లకు గురవుతున్నారు. ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారులపై ఎగబడిమరీ కరుస్తున్నాయి. మూగజీవాలపైనా దాడి చేస్తున్నాయి. ఇక వాహనదారులను వెంబడించి మరీ పాశవికంగా కొరుకుతున్నాయి. దీంతో కుక్కల గుంపు ఎక్కడ కనిపిస్తే ప్రజలు అటుగా వెళ్లేందుకు భయంతో వణికిపోతున్నారు.

సంగారెడ్డి పట్టణంలో ఇటీవల కుక్కల దాడిలో గాయాల పాలైన బాలుడు (ఫైల్)



ఒంటరిగా వెళ్లాలంటే భయం

మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా కనిపిస్తున్నాయి. ఇళ్లతో పాటు ఫంక్షన్లలో మిగిలిన ఆహార పదార్థాలను రోడ్ల పక్కన పడేస్తుండడంతో ఆయా మిగతా 8వ పేజీలో

పెరట్లో గంజాయి మొక్కల పెంపకం
దేవునిపల్లిలోని ఓ ఇంట్లో గుర్తింపు
ధ్వంసం చేసిన పోలీసులు 6

పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి
నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేయాలి
మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు 6

ఎరాన్ పరిశ్రమలో కెమికల్ లీకేజీ
నలుగురు కార్మికులకు గాయాలు 6

నల్లకుంట కోసం నడుం బిగించి..

● చెరువు పరిరక్షణకు ప్రకృతి ప్రేమికుడి దీక్ష
● రెండో రోజు గ్రామస్థులతో కలిసి నిరసన

గుమ్మడిదల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగులోని నల్లకుంట చెరువు పరిరక్షణ కోసం ప్రకృతి ప్రేమికుడు జ్ఞానేశ్వర్ బుధవారం చెరువు వద్ద దీక్ష కొనసాగించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద దీక్ష చేయగా, పోలీసులు భగ్నం చేశారు. బుధవారం గ్రామస్థులతో కలిసి చెరువు వద్ద దీక్ష చేపట్టి, చెరువును పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకప్పుడు గ్రామానికి ప్రాణాధారంగా నిలిచిన చెరువు ఇప్పుడు కాలుష్యం కోరల్లో చిక్కుకుందని, పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలు చెరువు నీటిలో కలుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసినప్పుడు పరిశ్రమల నుంచి గుట్టుచప్పుడు కాకుండా రసాయన జలాలు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చెరువుల్లోకి కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, జ్ఞానేశ్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో గ్రామస్థులు మంగయ్య గౌడ్, స్వేచ్ఛరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జ్ఞానేశ్వర్

జైలు సిబ్బంది తస్మాస్ జాగ్రత్త

● సూపరింటెండెంట్ హెచ్చరికలు

కంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని, నిఘా విభాగం దృష్టిసారించిందని, నిఘా జైలు జైలు సూపరింటెండెంట్ కళాసాగర్ సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్చరించారు. కోర్టుకు వెళ్లి తిరిగి వస్తున్న ఖైదీలు నిషేధిత వస్తువులను జైలు లోపలికి తీసుకొస్తున్నారని, అలాగే ఖైదీలు, వారి కుటుంబ సభ్యుల నుంచి జైలు సిబ్బంది ఫోన్‌పే, గూగుల్‌పే ఖాతాలకు డబ్బులు బదిలీ అవుతున్నాయని ఆయన ఆ సందేశంలో పేర్కొన్నారు. నిఘా విభాగం ఈ వివరాలను సేకరించిందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ ఘటనతో జైలు నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జైలులో ఖైదీల ఆత్మహత్యాయత్నాలు, సైకో ఖైదీల వ్యవహారాలపై పత్రికల్లో వచ్చిన కథనాలు సంచలనం సృష్టించాయి. జైలు అధికారుల మాట వినని సూరజ్ పాండే అనే ఖైదీని చర్లపల్లి జైలుకు బదిలీ చేయడం విమర్శలకు మరింత బలం చేకూరుస్తుంది. ఎందుకు ఈ పరిస్థితులు తలెత్తాయో ఉన్నతాధికారుల స్పష్టతనివాల్సి ఉంది.

జీపీ కార్మికులకు జీతమేది?

మూడు నెలలుగా వేతనం అందక పండుగ కలలు ఆవిరి

మెదక్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మరో మూడు రోజుల్లో పెద్ద బతుకమ్మ, ఆ తర్వాత దసరా పండుగ. రాష్ట్రంలో అతి పెద్ద పండుగ రోజులివి. అయితే, మెదక్ జిల్లాలోని పంచాయతీ కార్మికులకు మాత్రం ఈ పండుగ కన్నీళ్లను మిగులుస్తున్నాయి. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో పండుగ సరుకులు, పిల్లలకు కొత్త దుస్తులు కొనలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామపంచాయతీల్లోని(జీపీ) పారిశుధ్య కార్మికులు, వాటర్ సప్లై వర్కర్లు, వీధి దీపాల నిర్వాహకులు, కాంట్రాక్టు సిబ్బంది అంతా 51 జీవో పరిధిలోకి వచ్చారు. మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తింపు పొందారు. కారోబార్‌తో సహా ప్రతీ కార్మికుడు పంచాయతీలో అన్ని పనులు చేయాలి. వారంతా తమ జీతంపైనే పూర్తిగా ఆధారపడతారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 21 మండలాల పరిధిలో మొత్తం 492 గ్రామ పంచాయతీలలో 1,673 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ కార్మికుడికి నెలకు రూ.9,500 వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే, జూన్ నెల నుంచి వేతనాలు నిలిచిపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, పండుగ వేళ కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నామని, చిన్నశంకరంపేటకు చెందిన ఓ మహిళా కార్మికురాలును 'ఆంధ్రజ్యోతి' పలకరించగా కన్నీటి పర్యంతమైంది.

త్వరలోనే జీతాలు అందుతాయి

పంచాయతీ కార్మికులకు రెండు, మూడు నెలలుగా వేతనాలు పెండింగులో ఉన్నాయి. ప్రభుత్వానికి లేఖ రాశాం. త్వరలోనే జీతాలు చెల్లించే అవకాశం ఉంది. ఇప్పటికే జీపీ కార్మికుల జీతాలకు సంబంధించిన బిల్లు మంజూరైంది. ప్రస్తుతం ఖజానా శాఖ వద్ద ఫైల్ ఉంది. కార్మికులు ఆందోళన చెందవద్దు.

- యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి, మెదక్



తారల సందడి

ఆర్‌ఎక్స్ 100 సినిమా ఫేం హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్.. ప్రముఖ సింగర్ మంగ్లీతో కలిసి నారాయణఖేడ్‌లో సందడి చేశారు. శుభవర షాపింగ్‌మాల్‌ను ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించగా, పాయల్, మంగ్లీలు హాజరై సందడి చేశారు. వారిని చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.

-నారాయణఖేడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

104 ఉద్యోగులకు షాక్!

● మెడికల్ కాలేజీలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు
● ఇదేం సర్దుబాటు అంటూ ఉద్యోగుల ఆందోళన



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని 104 విభాగంలో (ఫిక్స్‌డ్ డే హెల్త్ సర్వీసెస్-ఎఫ్‌డీహెచ్‌ఎస్) పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇటీవల ఆ ఉద్యోగులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధి నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధికి బదలాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలోని పలు క్లస్టర్ల పరిధిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో), డ్రైవర్, సెక్యూరిటీగార్డ్‌లను ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు సర్దుబాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న 104 ఉద్యోగులను పక్క జిల్లాల్లోని మెడికల్ కాలేజీకి బదిలీ చేయడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వికారాబాద్‌కు ఆరుగురు, మెదక్‌కు ముగ్గురు

సంగారెడ్డి జిల్లాలో 104 విభాగం కింద పనిచేస్తున్న ఆరుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను(డీఈవో) వికారాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, ముగ్గురు డ్రైవర్లను మెదక్ మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. మరో ఐదుగురు డ్రైవర్లు, నలుగురు సెక్యూరిటీగార్డ్‌లు, ఓ ఆఫీస్ సబార్డినేట్‌ను సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సర్దుబాటుపై బదిలీ చేశారు. అయితే, డీఈవోలకు రూ.19,500 వేతనం, డ్రైవర్లకు రూ.19,500, సెక్యూరిటీగార్డులకు రూ.15,600 వేతనం చెల్లిస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కింద వీరిని బదలాయింపు చేశారు. ఈ జిల్లా ఉద్యోగులను ఇదే జిల్లాలో కాకుండా 60 కిలోమీ ఉన్న మెడికల్ కాలేజీలకు బదిలీ చేయమేంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా కనీసం కౌన్సెలింగ్ నిర్వహించకుండా చేయడం పట్ల మండిపడుతున్నారు. 17 ఏళ్లుగా కొద్దిపాటి వేతనాలతో ఉద్యోగాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్న తమను పొమ్మనలేక పొగబెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 104 విభాగంలో పనిచేస్తున్న మిగతా క్యాడర్ ఉద్యోగులతో పాటు ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషియన్లనూ ఇదే రకంగా త్వరలో బదిలీ చేసే అవకాశాలున్నాయని తెలిసింది.

పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి

● నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేయాలి
● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నమోదైన పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోక్సో కేసుల దర్యాప్తు, ప్రస్తుత స్థితి కేసుల్లో సాధించిన పురోగతి తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. బాలికలపై జరిగే శారీరక, లైగింక వేధింపుల నేరాలు అరికట్టేందుకు పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసి.. బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శుభవల్లి, అదనపు ఎస్పీ మహేందర్, ఉమెన్ సేఫ్టీవింగ్ ఏసీపీ శ్రీధర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ప్రతీ కేసులో నాణ్యమైన విచారణ చేయాలి : ఎస్పీ పంకజ్

నారాయణఖేడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కేసులో నాణ్యమైన విచారణ చేస్తూ బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఖేడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. స్టేషన్ పరిధిలోని శుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించారు. విచారణలో ఉన్న కేసుల వివరాలను డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విచారణలో సందేహాలు ఉంటే విచారణ సపోర్టు సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి వాహనాల వేగం అదుపునకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.


ఖేడ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ పంకజ్

ఇంటి పెరట్లో గంజాయి మొక్కల పెంపకం

● ధ్వంసం చేసిన పోలీసులు

కల్హేర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లిలో ఇంటి పెరట్లో గుట్టుచప్పుడు కాకుండా పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామంలో చిన్ననమిళ్ల మల్లేశం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై మధుసూదన్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేశారు. అక్కడ గంజాయి మొక్కలు ఉండగా, వ్యవసాయ, పంచాయతీ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. నిందితుడు మల్లేశంపై కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి పరిశీలించి, గంజాయి పెంచినా.. అమ్మినా.. సేవించినా చట్ట ప్రకారం నేరమని తెలిపారు.


పట్టుబడిన గంజాయి మొక్కలతో కంగ్టి సీఐ వెంకటరెడ్డి, కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి

200 గ్రాముల గంజాయి స్వాధీనం

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహ్మదాపూర్ రోడ్డులో గంజాయి తాగుతూ, విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి చెందిన చుక్క అనిల్, మదన అభినయ్, బాలాజీనగర్‌కు చెందిన బూర్ల రాకేష్‌లుండగా, కరీంనగర్‌కు చెందిన వంశీ పరారీలో ఉన్నాడని చెప్పారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయితోపాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మారెడ్డి ఉన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ములుగు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి). చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకుంది. ములుగుకు చెందిన కోల్లెల్లి చంద్రమ్మ(70) నాలుగురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని కుడి గుంటలో చంద్రమ్మ శవమై కనిపించింది. కుటుంబసభ్యులు చూసి పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కోల్లెల్లి చంద్రమ్మ(ఫైల్)

మహిళ అదృశ్యం

జహీరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేగుంట గ్రామానికి చెందిన ఓ మహిళ కనిపించకుండా పోయింది. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్యాలారం సవిత(22) ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లింది. బుధవారం కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇరుగుపొరుగు వారి వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సవిత ఆచూకీ తెలిస్తే 87126 61847 నెంబరు కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.


సవిత(ఫైల్)

నేర రహిత సమాజం కోసం ప్రజలు సహకరించాలి : డీఎస్పీ

చేగుంట సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరరహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు తోడ్పాటు అందించాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం చేగుంటలో కట్టడి ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని వివిధ కాలనీల్లో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు 110 పోలీసులతో కట్టడి ముట్టడి నిర్వహించినట్లు తెలిపారు. అద్దెకు ఉంటున్న ఇతర రాష్ట్రాల వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 69 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట, తూప్రాన్ సీఐలు వెంకట్‌రాజాగౌడ్, రంగాకృష్ణ, ఎస్సైలు చైతన్యకుమార్‌రెడ్డి, సృజన, నారాయణ, నర్సింలు, నరేష్, శివానందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్‌లో కల్తీ లేదు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవ్వపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్‌లో కల్తీలేదని వినియోగదారులు అపోహలు చెందవద్దని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి నిత్యానందం పేర్కొన్నారు. బంకులో పెట్రోల్, డీజిల్ నీళ్ల కల్తీ ఉందని కొంతమంది వినియోగదారులు యాజమాన్యంతో ఘర్షణకు దిగారు. పెట్రోల్ కల్తీ ఉందని పత్రికల్లో ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు బుధవారం పెట్రోల్ బంకును సందర్శించి ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్‌ను సేకరించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం హెచ్‌పీ బంకుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తనిఖీలో అసిస్టెంట్ సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఎండీ అబ్దుల్ నిసాన్, సిబ్బంది ఉన్నారు.

బస్సులో బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలు

● బ్యాగ్‌లో రూ.1.80 లక్షల బంగారు వస్తువులు
● డీఎం సమక్షంలో ప్రయాణికురాలికి అందజేత
● తిరుపతి నుంచి వస్తుండగా ఘటన


ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అందజేస్తున్న డీఎం ఉపేందర్, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నుంచి తిరుగుపయనమైన ఓ ప్రయాణికురాలు ఆర్టీసీ బస్సులో హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సమీపంలోని చిట్కుల్‌కు చెందిన కోన సత్యరమ్య తిరుపతి వెళ్లి వస్తూ ఈ నెల 15న చిట్కుల్‌లో దిగిపోయింది. బస్సులోనే బ్యాగు మరిచిపోవడంతో డ్రైవర్ గోపాల్ బస్సును డిపో అధికారులకు అప్పగించాడు. బస్సు బుక్ చేసుకునే సందర్భంగా ఇచ్చిన సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా సత్యరమ్యకు ఫోన్‌చేసి సమాచారమందించారు. బ్యాగులో రూ.1.80 లక్షల విలువైన బంగారు వస్తువులు ఉన్నట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ సమక్షంలో బుధవారం ప్రయాణికురాలు, కుటుంబసభ్యులను పిలిపించి బంగారు వస్తువులతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను అప్పగించారు. దీంతో ప్రయాణికురాలు ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో జింక మృతి

నారాయణఖేడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండల పరిధిలోని గురుసింగ్‌తండా శివారులో ఓ జింక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఖేడ్ అటవీశాఖ రేంజ్ అధికారి అనురాధ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండా శివారులోని నీటి కుంట సమీపంలో ఓ జింక మృతిచెంది పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తమకు సమాచారం అందించారన్నారు. బీట్ అధికారులు ధన్‌సింగ్, వరప్రసాద్ అక్కడికి చేరుకుని జింకను పరిశీలించారు. ఈ జింక మృతిచెందిన ఐదురోజులు కావస్తున్నదని, పాముకాటు వల్ల మృతిచెందినట్టు భావిస్తున్నామని అనురాధ వివరించారు.


గురుసింగ్‌తండా శివారులో మృతిచెందిన జింక

బైక్ కవర్ నుంచి రూ. లక్ష మాయం

● వారాంతపు సంతలో ఘటన

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం జరిగిన వారాంతపు సంతలో బైక్ కవర్‌లో దాచిన నగదు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన ఓ రైతు దంపతులు బ్యాంకు నుంచి రూ. లక్ష విత్ డ్రా చేసుకుని, రెండు బండిల్స్‌గా (ఒక్కొక్కటి రూ. 50 వేలు) బైక్ ముందు కవర్‌లో పెట్టారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగారు. అయితే, వీరి బైక్ కవర్‌లో నుంచి ఓ బండిల్‌ను దుండగులు అపహరించారు. అందులో రూ. 49వేలు ఉన్నాయి. ఇంటికి వెళ్లిన తర్వాత గమనించిన దంపతులు పోలీసులను ఆశ్రయించారు. అయితే, దొంగలు బ్యాంకు నుంచే వీరిని అనుసరించి ఉంటారా? లేక సంత దగ్గర సందడిలో చోరీ చేశారా అన్నది తేలాల్సి ఉంది. ఇక.. వారాంతపు సంతకు వేలాదిమంది తరలివస్తుండటంతో రద్దీగా ఉంటుంది. గతంలో సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం నగదు అపహరణ చోటుచేసుకోవడంతో వారాంతపు సంతలో గస్తీ పెంచాలని పట్టణవాసులు కోరుతున్నారు.


సీసీటీవీ ఫుటేజీలో బైక్‌పై వెళ్తున్న ఆగంతకులు

ఎరాన్ పరిశ్రమలో కెమికల్ లీకేజీ

● నలుగురు కార్మికులకు గాయాలు


గాయపడ్డ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత

సదాశివపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎరాన్ లైఫ్‌సైన్స్ పరిశ్రమలో బుధవారం రసాయనాలు లీకై నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పరిశ్రమ యాజమాన్యం చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు శివారెడ్డి, శ్రీనివాస్, దివాకర్, సింహాచలంలను సంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ పరామర్శించారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం సంభవించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయాల పాలైన కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం కార్పొరేట్ వైద్యం అందించాలని, కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంలో కాంక్రీట్ మిక్సింగ్ టిప్పర్ దగ్ధం

రామాయంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పాత హైవేపై బుధవారం కరెంటు మెయిన్ లైన్లు తగిలి కాంక్రీట్ మిక్సింగ్ టిప్పర్ దగ్ధమైంది. పాత హైవేపై నుంచి టిప్పర్ వెళ్తుండగా, ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. టిప్పర్ డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సీసీరోడ్డు నిర్మాణ పనుల కోసం కాంక్రీట్ మిక్సింగ్ తరలించే ప్రయత్నంలో ప్రమాదం చోటుచేసుకుంది.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డిడిగి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. డిగిడి గ్రామ శివారు ఓ చెట్టు కింద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది.దీంతో ఆయన వెళ్లి దాడిచేసి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 17,620నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

గుమ్మడిదలలో దొంగల హల్‌చల్

● నిన్న ఐదు తులాలు పుస్తెలతాడు చోరీ
● నేడు పట్ట పగలే సహకార సొసైటీ ఆఫీసులో చోరీ
● రూ. 50 వేల విలువైన ల్యాప్ ట్యాబ్ అపహరణ


దొంగలు చోరీకి పాల్పడిన సహకార సొసైటీ సంఘం గుమ్మడిదల

గుమ్మడిదల, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రోజుకోచోట చోరీలు చేస్తున్నారు. మంగళవారం పట్టపగలు రాధమ్మ అనే మహిళ మెడలోంచి ఐదు తులాల పుస్తెలతాడు లాక్కొని వెళ్లగా, బుధవారం పట్టపగలే సహకార సొసైటీ కార్యాలయంలో చోరీకి పాల్పడటం కలకలం రేపింది. మండల కేంద్రంలోని సహకార సొసైటీ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం కార్యాలయానికి తాళం వేసి సొసైటీ బ్యాంకునకు వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు వెనుక తలుపు పగులగొట్టి, లోనికి చొరబడి రూ.50 వేల విలువైన ల్యాప్‌ట్యాప్‌ను ఎత్తుకెళ్లారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మూడురోజుల క్రితం ఓ కాంగ్రెస్ నాయకుడి కార్యాలయంలోనూ దొంగలు ప్రవేశించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కార్యాలయంలో విలువైన వస్తువులు దొరక్కపోవడంతో గదిలోని వస్తువులను పగులగొట్టి, చెల్లాచెదురు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, భద్రత పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వచ్చేనెల 16 నుంచి పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి క్రీడలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఆటలపోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎస్జీఎఫ్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల 16,17,18 తేదీల్లో 69వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను పటాన్‌చెరు కేంద్రంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. అండర్-17 విభాగంలో వాలీబాల్, అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. 33 జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులు, వందమంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. వీరందరికీ మూడురోజులపాటు సొంత నిధులతో భోజనం, వసతి, విజేతలకు బహుమతుల ఇస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో నిలిచిన విజేతలను సొంత ఖర్చులతో జాతీయస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు.







గజ్వేల్ :అర్ధనారీశ్వర అవతారంలో దర్శనమిస్తున్న సంతోషిమాత అమ్మవారు, ఝరాసంగం : దుర్గామాత పూజలో నాయకులు, భక్తులు, చేర్యాల: అన్నపూర్ణ దేవి అలంకరణలో దుర్గాదేవి

అర్ధనారీశ్వర అవతారంలో..

గజ్వేల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అర్ధనారీశ్వర అవతారంలో గజ్వేల్ పట్టణంలోని శ్రీ సంతోషి మాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. గజ్వేల్‌లోని సంతోషిమాత ఆలయంలో పూజారి దేశపతి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణదేవిగా దుర్గాదేవి..

ఝరాసంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దుర్గదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, ఆలయ మండపంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుంత రావుపాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు విశేష పూజలు..

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వాసవీనగర్, అయ్యప్పస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. చావడి వద్ద దుర్గాదేవికి బోనాలు సమర్పించి బెల్లంపాయసం నివేదించారు.



హుస్నాబాద్‌లో సీతాఫలాల విక్రయాలు



సీతాఫలాలు

సీతాఫలం.. మహాప్రియం

గంప కాయలకు రూ.400

- హుస్నాబాద్ నుంచి ఇతర పట్టణాలకు ఎగుమతి
- ఈసారికాఅత ఉన్నా కోతుల బెడద ఎక్కువ

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అందరికీ ప్రియమైన సీతాఫలం మహా ప్రియం అయ్యింది. అధిక విటమిన్లు ఉండే సీతాఫలాలకు ప్రస్తుతం భలే డిమాండ్ ఏర్పడింది. గుట్టలు, కంచెలు ఎక్కువగా ఉన్న మెట్టప్రాంతమైన హుస్నాబాద్‌లో ఈ ఫలాలు ఎక్కువ కాస్తాయి. వీటితో ఈ రెండునెలలు ఈ ప్రాంతవాసులకు ఉపాధి దొరుకుతుంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోనే వీటిని విక్రయించే వారు. కానీ ప్రస్తుతం పట్టణాలకే ఎగుమతి చేస్తున్నారు. దళారులు రైతుల నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్ వంటి ఇతర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో వీటి ధరలు పెరిగిపోయాయి. ఈసారి సమయానుకూలంగా వర్షాలు పడటంతో కాత బాగానే ఉన్నా కోతులు కాయలు చిన్న సైజులో ఉన్నప్పుడే తెంపివేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. కోతుల బెడదతో చిన్న సైజులోనే తెంపాల్సి వస్తున్నదని పేర్కొంటున్నారు. పక్షంరోజుల నుంచి వీటి విక్రయాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం తెల్లవారుజామునే సీతాఫలాల గంపలతో హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నిండిపోతుంది. ఇక్కడి నుంచి ట్రాలీ ఆటోల్లో వివిధ పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. మేము పొద్దంతా కష్టపడి తీసుకొస్తే గిట్టుబాటు కావడం లేదని, దళారులు తమ వద్ద తీసుకొని ఎక్కువ ధరలకు పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారని పేర్కొంటున్నారు.

వంద కాయలకు రూ.750 పైనే..

హుస్నాబాద్‌లో వంద సీతాఫలాల కాయలకు రూ.750 పైగా విక్రయిస్తున్నారు. మరి పెద్ద సైజు కాయలకు రూ.800లకు పైగా అమ్ముతున్నారు. గంపకు రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. గంపలో 40 నుంచి 50 వరకు మాత్రమే ఉంటున్నాయి. మరి కొద్దిరోజుల తరువాత వీటి ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు.

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు..

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు సీతాఫలాలు ఎగుమతి అవుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, కుందనవానిపల్లి, ధర్మారం, నందారం, తెనుగుపల్లి, మల్‌చెర్వుతండా, రేగొండ, గుబ్బడి, కోహెడ మండల బస్వాపూర్, నాగసముద్రాల గ్రామాల నుంచి హుస్నాబాద్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున వీటి కొనుగోళ్లతో హుస్నాబాద్ బస్టాండ్ కిటకిటలాడుతుంది. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హుజూరాబాద్ పట్టణాలకు ట్రాలీ ఆటోల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

కోతుల బెడద ఎక్కువ



ఈసారి వర్షాలు మంచిగా పడి చెట్లకు కాయలు కాసినప్పటికీ కోతులతో లాభం లేకుండా పోతుంది. చిన్నగా ఉన్నప్పుడే తెంపి వేస్తున్నాయి. అందుకే చిన్న సైజులో ఉన్నప్పుడే తెంపి తీసుకొస్తున్నాం. పొద్దంతా కష్టపడితే కూలి గిట్టుబాటు అవుతుంది. రోజు రెండు, మూడు గంపలు తీసుకొస్తున్నాం. ముందు ముందు ఇంకా ధరలు పెరుగుతయి.

\- గుగులోతు సత్తవ్వ, కొండాపూర్

ఈ నెలరోజులు కూలి దొరికినట్లే..



సీతాఫలాలు కాసే ఈ నెలరోజులు మాకు కూలి దొరికినట్లే. రోజు రూ.500 నుంచి రూ.700 వరకు వస్తాయి. కాయలు పెద్దగా రాకపోవడంతో ఒక్కోసారి తక్కువ ధరకే అమ్ముతున్నం. ముఖ్యంగా కోతులతోనే కాయలు దొరకడం లేదు. మేము హుస్నాబాద్‌కు తీసుకొచ్చి అమ్మితే మధ్యలోల్లు కరీంనగర్, హన్మకొండ, హుజూరాబాద్ పంపిస్తున్నరు.

\- మేడబోయిన లసుమయ్య, గుబ్బడి

కేటీఆర్ ఇచ్చే జీతాలు తీసుకుని మాట్లాడుతున్నారు

- యూట్యూబ్ చానళ్లపై ఎంపీ రఘునందన్ ఘాటు వ్యాఖ్యలు



తూప్రాన్ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీ

తూప్రాన్/రామాయంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మా యూట్యూబ్ మిత్రులకు బాగా ఆవేశం వస్తుంది. రఘునందన్‌రావుకు కాంగ్రెస్‌తో సంబంధాలు అంటగడుతున్నారు. కేటీఆర్ వద్ద జీతం తీసుకుంటున్న కొందరు సెల్‌ఫోన్ మిత్రులు బాగా మాట్లాడుతున్నారు. కేటీఆర్ ఇచ్చే జీతాలకు మాట్లాడే...' అంటూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ ఆస్పత్రి ఆవరణలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆయన ఆస్పత్రి ఆవరణలో మొక్కనాటారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రఘునందన్ కాంగ్రెస్ వాళ్లని తిట్టాలి కదా అంటూ మా యూట్యూబ్ మిత్రులకు బాగా ఆవేశం వస్తుందని ఈ వ్యాఖ్యలు చేశారు. బంగారు తెలంగాణ చేశామని బీఆర్‌ఎస్ వాళ్లు చెబుతారని, పదేళ్లలో కేసీఆర్ సొంత జిల్లా తూప్రాన్‌లో ఒక్క డిగ్రీ కళాశాల కూడా పెట్టలేని గొప్పనాయకుడన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు శాసనసభలో ఆంధ్రలో డిగ్రీ కళాశాలలు ఎక్కువని, తెలంగాణలో తక్కువని మాట్లాడేవారని, కేసీఆర్ పదేళ్లలో తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఎందుకు పెట్టలేదో సూటిగా సమాధానం చెప్పాలని అన్నారు. కేసీఆర్ సొంత జిల్లాలో డ్రాపవుట్లు అవుతున్నారని గ్రౌండ్ రిపోర్ట్ వచ్చిందని, దీనికి మీ కేటీఆర్.. మీ యూట్యూబ్ యాంకర్లు తీసుకునే జీతాలతో కాలేజీ పెడితే బాగుంటుందన్నారు. రఘునందన్‌రావును విమర్శించడానికి చాలా టైం ఉందని, రమ్మంటే టీవీ చానెల్‌కు వస్తానన్నారు. కాంగ్రెస్ సక్కదనం 20 నెలలు గడిచిపోయిందని, తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సిద్దిపేట, మెదక్ జిల్లాల బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్, మల్లేశ్‌గౌడ్, నత్తి మల్లేశ్ ముదిరాజ్, జానకీరాంగౌడ్, సాయిబాబాగౌడ్, సంఖ్య యాదగిరి, దుర్గరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని రామాయంపేట పట్టణ ప్రజలకు, వ్యాపారులకు ఎంపీ రఘునందన్ బుధవారం జీఎస్టీపై అవగాహన కల్పించారు. అంతకు ముందు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడిని బ్రహ్మోత్సవం



గరుడవాహనంలో వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

గుమ్మడిదల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలలో కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ ముద్దుల బాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు, వంశపార ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయంలో ఘనంగా ధ్వజారోహణం నిర్వహించారు. రెండోరోజు సైతం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి అర్చకులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా గరుడవాహన సేవ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా ఊరేగుతున్న స్వామివారికి భక్తులు పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజువారీగా భిన్న రకాల వాహన సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పాలకవర్గం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఇందేల బాల్‌రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాస్, పుట్ట నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టును సందర్శించిన జీఆర్‌ఎంబీ చైర్మన్

- రివిట్‌మెంట్ కుంగిన ప్రాంతం పరిశీలన



సింగూరు ప్రాజెక్టును సందర్శిస్తున్న జీఆర్‌ఎంబీ చైర్మన్ పాండ్య, బోర్డు సభ్యులు

పుల్‌కల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును గోదావరి నది యాజమాన్య సంస్థ(జీఆర్‌ఎంబీ) చైర్మన్ బీపీ.పాండ్య సందర్శించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పవర్ బోర్డు సభ్యుడు ఆర్‌ఎం.రంగరాజన్‌తో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకుని స్థానిక ఇంజనీర్లతో మాట్లాడారు. రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రాజెక్టు గేట్లు, ఆనకట్టను, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తడంతో వరద జలాలు దిగువకు పారుతుండగా తిలకించారు. ప్రాజెక్టుపై కలియతిరుగుతూ ప్రస్తుత నీటి మట్టం, ఎగువ నుంచి వస్తున్న వరద జలాల వివరాలను ఈఈ భీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున అంతర్భాగంలో ఆనకట్ట రివిట్‌మెంట్ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉండటంతో స్థానిక ఇంజినీర్లు ముందస్తు జాగ్రత్త చర్యగా కంకర చిప్స్, ఇసుక బస్తాలను పేర్చడంతో పాటుగా ఇతరత్ర భద్రత చర్యలు తీసుకుంటుండటంతో వారిని అభినందించారు. ప్రాజెక్టును పరిసర ప్రాంతాన్ని ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి చెట్లు, మొక్కలు, గడ్డి మొలవకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంజనీర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ పోచమల్లు, ఈఈ భీమ్, డీఈఈ నాగరాజు, ఏఈఈలు మహిపాల్‌రెడ్డి, శాలిని, స్టాలిన్, సిబ్బంది మన్నె నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

- వేడుకలు ప్రారంభించనున్న మాధవానంద సరస్వతీ స్వామి
- తరలిరానున్న వేలాది మంది భక్తులు



నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం

వర్గల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని నాచగిరి వద్ద గిరి ప్రదక్షిణను తొగుట రాంపురం పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ ప్రారంభించనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు ఘనంగా చేశారు. నాచగిరి క్షేత్రం చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల గిర ప్రదక్షిణ ఉంటుంది. ఆలయం వద్ద ఉదయం 7.30 గంటలకు స్వామిజీ గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా తెలిపారు. వేడుకలకు వేలాది మంది తరలిరానున్న నేపథ్యంలో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరావు పర్యవేక్షణలో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థుల వసతి ఎక్కడ..?

- షురూ కాని తాత్కాలిక షెడ్లు
- తాత్కాలిక భవనంలోనా.. స్కూల్‌లోనేనా?
- హాస్టల్ కూలడంతో బసకు అవస్థలు



హాస్టల్ భవనం కూల్చివేయడంతో ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

మునిపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి ఈనెల 9న కూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకులాల కార్యదర్శి రమణకుమార్ తదితరులు సందర్శించి పురాతన భవనాలను కూల్చివేసి తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన రోజే 7వ తరగతికి చెందిన విద్యార్థులతోపాటు మరి కొంతమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. 22 నుంచి దసరా సెలవులు రావడంతో మిగతా విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే సంఘటన జరిగి 15 రోజులవుతున్నా తాత్కాలిక షెడ్ల ఏర్పాటు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లింగంపల్లి గురుకుల సొసైటీలో మొత్తం 640 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో అన్ని తరగతులకు సంబంధించి పురాతన హాస్టల్, స్కూల్ భవనాలు ఉన్నాయి. కానీ ఇటీవల హాస్టల్ భవనం కూలడంతో 7, 8,9, 10వ తరగతులకు సంబంధించి మొత్తం 320 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం లేకపోవడంతో స్కూల్ భవనంపై ఉన్న రేకుల షెడ్డులోనే తల దాచుకుంటూ నరకయాతన అనుభవించారు. ఆ షెడ్డు సైతం వర్షానికి కురుస్తుండడంతో వారంరోజుల పాటు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. మిగతా 5, 6వ తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ భవనం ఉంది. దసరా సెలవులు కావడంతో అందరూ ఊళ్లకు వెళ్లిపోయారు. సెలవులు ముగిసేవరకైనా రేకుల షెడ్లు నిర్మిస్తారో లేదో వేచిచూడ్దాం.

'ఆశా'లకు ఉద్యోగ భద్రత కరువు

- 24 గంటలు పని.. కనీస వేతనం లేదు..
- సర్వేలతో సతమతం.. విడుదల కానీ లెప్రసీ సర్వే డబ్బులు
- ఆశాల పోరాటాలకు కార్మిక సంఘాల మద్దతు



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్స్(ఫైల్)

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ, ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ.. గర్భిణులకు, బాలింతలకు తగిన సలహాలు, సూచనలు చేసే ఆశావర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కరువైంది. ఆరోగ్య సర్వేతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేల్లో భాగస్వామ్యులను చేయడంతో పనిభారం పెరుగుతోందని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వం చెప్పిన విధంగా ఆశాల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని కొంతకాలంగా ఆశావర్కర్లు నిరసనలను తెలుపుతూనే ఉన్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సుమారు 980 పైచిలుకు ఆశావర్కర్లు పనిచేస్తున్నారు.

మూడేళ్లుగా విడుదల కాని లెప్రసీ డబ్బులు

ఆశావర్కర్లతో లెప్రసీకి సంబంధించిన సర్వే గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొనసాగింది. సంవత్సరానికి 14 రోజులపాటు లెప్రసీ సర్వే కొనసాగుతుంది. ఇందులో పాల్గొన్న ఆశావర్కర్‌కు 14 రోజులకు రూ.700 వేతనం ఇస్తారు. జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా లెప్రసీ సర్వే డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని ఆశావర్కర్స్ ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల ఒకటవ తేదీలోపే జీతం డబ్బులు పడేదని, ప్రస్తుత ప్రభుత్వంలో నెల గడిచిన తర్వాత 15, 20 రోజుల వరకు జీతాలు ఆలస్యంగా వస్తున్నాయని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతం రావాలంటే కేసులు తప్పనిసరి

ఆశావర్కర్స్‌కు ప్రతీనెల రూ.9,500 వేతనాన్ని ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తోంది. ఈ వేతనం సరిగ్గా రావాలి అంటే ఒక్కో ఆశావర్కర్ ప్రతి నెల ఒక్క డెలివరీ కేసు, ఒక్క గర్భవతి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. అలా నమోదు చేయకపోతే జీతం రావడం కొంత ఇబ్బందికరంగా మారుతూ ఉందని ఆశాలు అంటున్నారు. 24 గంటలు పనిచేస్తున్న తమకు కనీసం సెలవు దినాలు కూడా లేవని, కనీస వేతనం ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

ఆశావర్కర్స్‌కు ఫిక్స్ వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఆదివారం సెలవు దినాన్ని ప్రకటించాలి. సర్వే చేస్తున్న సందర్భంలో అనారోగ్యం పాలైన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సర్వే డబ్బులను పూర్తిస్థాయిలో చెల్లించాలి. మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల సమస్యలను చేర్చాలి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి.

సర్వేకు వెళ్లినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి



ఆశావర్కర్లుగా ఫీవర్, టీబీ, ఫైలేరియా, లెప్రసీవ్ అంటే సర్వేలను గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నాం. సర్వేకు వెళ్లినప్పుడు కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అలాంటి సందర్భంలో ప్రభుత్వం ఆశావర్కర్స్‌ను ఆదుకోవాలి. వారికి ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఆశావర్కర్స్ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలను కొనసాగిస్తాం.

\- ప్రవీణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

ఆశావర్కర్స్‌కు అండగా ఉంటాం



ఆశావర్కర్స్ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి వారికి కనీస వేతనం అందించాలి. వారు చేసే న్యాయమైన పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుంది. భవిష్యత్‌లో ఆశావర్కర్స్ సమస్యలను పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతాం..

\- రవికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

న్యూస్ బాక్స్

శిశుగృహకు శిశువు అప్పగింత

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లభ్యమైన ఆడ శిశువును ఎస్ఎన్సీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 22న గుర్తు తెలియని వ్యక్తులు ఆడ శిశువును ఆస్పత్రి వరండాలో వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం పసికందును శిశుగృహ అధికారులకు అప్పగించారు. పసికందు నీరసంగా ఉండడంతో ఎస్ఎన్సీయూలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

మూడో రోజు ఓపెన్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఇంటర్మీడియట్ పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు పరీక్షకు 225 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరయ్యారు. టెన్త్ మ్యాథ్స్ సబ్జెక్టుకు 127 మంది హాజరుకాగా 21 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ సబ్జెక్టుకు 20 మంది హాజరుకాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన బిజినెస్ స్టడీస్ సబ్జెక్టుకు ముగ్గురు హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సంగారెడ్డి ఆర్డీవోగా రాజేందర్

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా గున్నాల రాజేందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలో మెప్మా అధికారిగా విధులు నిర్వహించిన రాజేందర్‌ను సంగారెడ్డి ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

తాగు నీటి సమస్య పరిష్కారానికి సమన్వయంతో పనిచేయండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మున్సిపల్, సిగ్రిగేషన్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. నీటి పన్ను బకాయిలు కోట్లలో పేరుకుపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బకాయిలన్నీ త్వరగా వసూలు చేయాలన్నారు. సంగారెడ్డి పట్టణానికి నిత్యం 7 ఎంఎల్‌డీ మంచినీటి సరఫరా అవసరముండగా ప్రస్తుతం 4, 5 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

బ్యాంకింగ్ సేవలతోనే ఆర్థిక ప్రగతి

అమీన్‌పూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మెరుగైన బ్యాంకింగ్ సేవలతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ తుమ్మలపాండురంగారెడ్డి అన్నారు. బుధవారం అమీన్‌పూర్‌లో యాక్సిస్‌బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నందారం రమేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



అల్లాదుర్గం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పేట మాజీ సర్పంచ్ రాయిపల్లి శ్రీశైలం (48) గుండెపోటుతో బుధవారం కన్నుమూశారు. గ్రామానికి చెందిన శ్రీశైలం మంగళవారం అస్వస్థతకు గురై గుండెపోటు రావడంతో అతడిని కుటుంబసభ్యులు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచనతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం ఆయన కన్నుమూశారు. మృతుడికి భార్య బాలమణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీశైలం మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నిరుపేదల ఆరోగ్యాలకు భరోసా

జహీరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆరోగ్యాలకు సీఎంఆర్ఎఫ్ భరోసాను కల్పిస్తుందని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని వివిధప్రాంతాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు రూ.1.053వేలు విలువచేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధికి నిధులు

● మెదక్ జిల్లా నర్సాపూర్ అభివృద్ధికి రూ.15 కోట్లు ● సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు రూ.16.28కోట్లు



నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం

నర్సాపూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణానికి మొదటిసారిగా కాంగ్రెస్ హయాంలో అత్యధికంగా రూ.15 కోట్లు మంజూరు కావడంతో పట్టణ అభివృద్ధి వేగవంతం కానున్నది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నిధులు రాకపోగా గత ప్రభుత్వంలో మంజూరైన ప్రత్యేక డెవలప్‌మెంటు నిధులు కూడా రద్దు కావడంతో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు అసంపూర్తి దశలోనే నిలిచిపోయాయి. అదేవిధంగా ఇంకా అనేక సమస్యలతో నర్సాపూర్ సతమతమవుతున్నది. దీంతో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నర్సాపూర్‌తో పాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నర్సాపూర్ పట్టణంలోనే పలు అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పనకు రూ.15 కోట్లు మంజూరు చేస్తు మున్సిపల్ శాఖ నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. ఈ నిధులతో పట్టణంలో ప్రధానంగా కోమటికుంటను సుందరీకరణకు రూ.1.20 కోట్లు, పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి రాయరావు చెరువుకు రూ. 1.20కోట్లు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కోసం రూ.1.20కోట్లు వీటితో పాటు సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయల కల్పనకు వెచ్చించనున్నారు. ఏదిఏమైనా ఎన్నో రోజులుగా నిధుల కోసం ఎదురు చూస్తున్న పట్టణ ప్రజలకు ఎట్టకేలకు రూ.15కోట్లు మంజూరుకావడంతో వాటితో ప్రధానంగా పట్టణ పరిధిలో ఉన్న రాయరావు చెరువు, కోమటికుంటలను సుందరీకరణ చేయడానికి ఎక్కువ నిధులు కేటాయించడంతో స్థానిక ప్రజలకు మరింత అహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదించేందుకు వీలున్నది.

సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు

సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించిన వెంటనే మున్సిపల్ పరిపాలన విభాగం నుండి నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని అందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. త్వరలో నర్సాపూర్‌లో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రత్యేక నిధులు రూ.30కోట్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అవి కూడా మంజూరైతే పట్టణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు కూడా పూర్తి చేసే అవకాశం ఉందని, తద్వారా పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

నారాయణఖేడ్‌లో రహదారుల విస్తరణ

నారాయణఖేడ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రూ.16.28 కోట్లతో నారాయణఖేడ్ పట్టణాభివృద్ధి చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.15 కోట్ల నిధులతో ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట నుంచి రాజీవ్ చౌక్ వరకు మురుగు కాల్వలు, సీసీ నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 70 ఫీట్ల మేర రహదారిని విస్తరించనున్నట్లు తెలిపారు. బసవేశ్వర చౌక్ నుంచి రాజీవ్ చౌక్ మీదుగా రోడ్డు డివైడర్ల నిర్మాణంతో పాటు బట్టర్ ఫ్లై లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఖేడ్ ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైనందున మంజూరైన రూ.1.28 కోట్లతో పట్టణంలో ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ద్వారా దసరా ఉత్సవాలు, రావణ దహనానికి ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. బతుకమ్మ సంబురాలకు బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నారాయణఖేడ్‌లో తారల సందడి

● శుభవర షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుభవర షాపింగ్ మాల్‌ను స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సినీ నటి పాయల్ రాజ్‌పుత్, ప్రముఖ ఫోక్ సింగర్ మంగ్లీలు విచ్చేసి సందడి చేశారు. వారిని చూసేందుకు జనాలు పెద్ద ఎత్తున తరలి రావడంతో కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతం జనసంద్రంగా మారింది. షాపింగ్ మాల్ యజమాని సూర్యకాంత్‌గాంధీ మాట్లాడుతూ హైదరాబాద్ ధరలకే, నారాయణఖేడ్‌లో కూడా రిటైల్‌గా, హోల్‌సేల్ ధరలకు దుస్తులను విక్రయించనున్నామని, వస్త్రాల కొనుగోలుపై ఆఫర్లు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డితో పాటు బుద్దిరాం చౌదరి, నగేష్, డాక్టర్ అమిత్‌కుమార్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** కాంగ్రెస్ హయాంలో కల్యాణలక్ష్మీ చెక్కుల మంజూరులో ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ అందించనున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే వారి నాయకులే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ ఏక పక్షంగా వ్యవహరించారని ఎమ్మెల్యే విమర్శించారు. బుధవారం ఆయన పెద్దశంకరంపేట విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ చెక్కుల మంజూరును తాను ఒక్కటి కూడా ఆపలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి



సీఎంఆర్ఎఫ్ ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

కొల్చారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిసౌకర్యాలను కల్పిస్తున్నదని, అంతేకాకుండా విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలాగే నియోజక వర్గంలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో సీఎంఆర్ఎఫ్ కింద పెద్ద ఎత్తున చెక్కులు పంపిణీ చేశామన్నారు. మాతృదేవో భవ ట్రస్ట్ నుంచి గర్భిణులకు పోషకాహారం ఇట్లు అందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు గజిని వెంకట్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సావిత్రి రెడ్డి, శేఖర్ రెడ్డి మల్లారెడ్డి మహేశ్వర్‌రెడ్డి గోవర్ధన్ మన్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల కోసం తవ్వారు.. వదిలేశారు

నర్సాపూర్‌లో ప్రమాదకరంగా మారిన మురుగుకాలువ



క్రేన్‌తో గేదెను బయటకు తీస్తున్న దృశ్యం

నర్సాపూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మురికికాల్వ మరమ్మత్తు కోసం తవ్వి వదిలేసి నెలలు గడుస్తుండటంతో ఇప్పుడు అది ప్రమాదకరంగా మారి స్థానికులను భయందోళనకు గురి చేస్తుంది. నర్సాపూర్ పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని విఘ్నేశ్వరకాలనీకి ప్రధాన రోడ్డు నుంచి వెళ్లేందుకు ఉన్న దారి వద్ద మురికికాల్వ జామ్ కావడంతో మరమ్మతుల కోసం తవ్వి దాదాపు 3 నెలల నుంచి అలాగే వదిలేశారు. బుధవారం ఓ గేదె తవ్విన చోట ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి ఇరుక్కుని తీవ్ర అవస్థలకు గురైంది. చివరకు క్రేన్ సహాయంతో దానిని బయటకు తీయాల్సివచ్చింది. మనుషులు పడితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విఘ్నేశ్వరకాలనీ వాసులకు బస్టాండు వైపు నుంచి వెళ్లేవారికి ఇదే ప్రధాన దారి కావడంతో వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి కృషి: సునీతారెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొల్చారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే స్వగృహంలో మాందాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రూ.1.41 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా అభివృద్ధిపై దృష్టి సారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రాజాగౌడ్, మల్లాగౌడ్, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పనకు రూ.15కోట్లు మంజూరు కావడం హర్షనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు.



సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం అమ్మవార్లను అన్నపూర్ణదేవిగా భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనోహరాబాద్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి)

ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ సంబరాలకు పటాన్‌చెరు మహిళలు




బతుకమ్మ సంబరాలకు తరలివెళ్లిన మహిళలు

పటాన్‌చెరు సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏటా జరుగుతున్న సాంప్రదాయ పండుగలు వైభవంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న బతుకమ్మ సంబరాలకు బయలుదేరిన మహిళల బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాన్ని జాతీయస్థాయిలో నిర్వహించుకునేటట్లు సంబరాలు జరిపారని అన్నారు.

పారిశుధ్యకార్మికుల నిరసన

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తమకు పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని పారిశుధ్య కార్మికులకు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లాలోని ఆయా మున్సిపల్, జీపీల పరిధిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. కార్మికులపై పనిభారం తగ్గించాలని, పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టి ఆర్డీవో దేవుజకు వినతిపత్రం అందజేశారు. పటాన్‌చెరులో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై పంచాయతీరాజ్ కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖేడ్ డీఎల్పీవో కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

పోషకాహార ప్రాముఖ్యాన్ని వివరించండి



కల్హేర్ స్త్రీశక్తి భవన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కల్హేర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు పోషకాహార ప్రాముఖ్యాన్ని వివరించి దాని వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కల్హేర్ ఐకేపీ ఏపీఎం వంశీక్రిష్ణ సూచించారు. కల్హేర్ స్త్రీ శక్తి భవన్‌లోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు పోషకాహారంపై అవగాహన లేక అనేక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం ఐకేపీ కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి రేణుక, ఆడిటర్ నర్సప్ప, సీసీలు సాయిలు, కల్పన, సమత, రాధిక, రాములు, అకౌంటెంట్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ డాగ్స్

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో కుక్కలు మకాం వేస్తున్నాయి. వచ్చి పోయే జనాలతో పాటు పశువులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నామని, రాత్రి పూట కుక్కల అరుపులతో నిద్రపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. వీటిని అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. శునకాల బెడద నివారణలో భాగంగా వాటిని బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో గల్లీకో గుంపు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఏ గల్లీకి వెళ్లిన కుక్కల గుంపు దర్శనమిస్తున్నది. గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయి. వీధుల్లో రహదారి గుండా వెళ్లే వారిని గాయపరుస్తున్నాయి. పట్టణంలోని 38 వార్డుల్లోనూ ఇదే సమస్య ఉందని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల బెడదతో పగటి పూట కూడా బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఇక జిల్లా కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బహిరంగంగానే కుక్కలు సంచరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజూ ఏదో ఒక చోట కుక్క కాటు వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. కుక్కల బెడద నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు



కుక్క కరిచిన చోట 15 నిమిషాల పాటు సబ్బు, అయోడిన్‌తో కడగాలి. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రి వైద్యుడిని సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు కరిచిన చోట ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజెక్షన్ కచ్చితంగా తీసుకోవాలి. లేకపోతే రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. కుక్క కాటు అత్యంత ప్రమాదకరం, ఏ మాత్రం అజాగ్రత్త వహించినా రేబిస్ సోకి ప్రాణాలకే ముప్పువాటిల్లే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ సి.చక్రపాణి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి సౌజన్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అలాంటప్పుడే ఎలాంటి సమస్యలనైనా ధైర్యంగా ఎదుర్కొనగలుగుతారని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐఆర్ఎస్ఈటీఐ) కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉచిత న్యాయసహాయం అందించేందుకు తాము ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. సదస్సులో సంస్థ డైరెక్టర్ రాజేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన విశ్రాంత పోలీసు అధికారులు



ఏఎస్పీ రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘం నాయకులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్.రఘునందన్‌రావును జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు బి.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్, సభ్యులు ఎ.ప్రభాకర్‌రావు, సయ్యద్ సహంగీర్, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్, సురేష్, జీవన్, కిష్టయ్య, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో కార్మికుల కొరత తీర్చండి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కార్మికుల కొరత సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్‌లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు మణికంఠ, సంతోష, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

టేక్మాల్/మనోహరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం టేక్మాల్, మనోహరాబాద్ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను వారు వేర్వేరుగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మండలంలో నెలకొన్న భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు సాదాబైనామా, అసైన్డ్ తదితర భూములపై భూ భారతి రెవెన్యూ సదస్సు దరఖాస్తులపై జీపీవోలకు, సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బందికి పలు సూచనాలు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల పనితీరు భేష్

జహీరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సిబ్బంది పనితీరు బేష్‌గా ఉందని జహీరాబాద్ పట్టణసీఐ శివలింగం, డిపోమేనేజరు స్వామి కితాబిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీడిపోలో ప్రగతిచక్రాలు కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురికి ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పయాణీకులకు ఆర్టీసీపై నమ్మకం ఏర్పడాలంటే ఉద్యోగులే కీలకమని, కండక్టర్లు డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇంచార్జీ తిరుమలేష్ ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

పొరాదేవి బయలుదేరిన దీక్షాధారులు



పుల్‌కల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గిరిజన తండాలకు చెందిన భవానీమాత, సేవాలాల్ మహారాజ్‌లు దీక్షమాల విరమణకు మహారాష్ట్రలోని పొరాదేవికు బయలుదేరారు. బుధవారం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలోని సేవాలాల్ మహారాజ్ ఆలయం నుంచి ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ముందుగా ఆలయం చుట్టూ కొబ్బరి మొక్కలను నాటారు. గిరిజన తండా మహిళలు, సంప్రదాయ నృత్యాలు చేయగా, ప్రజలు భజనలతో సాగనంపారు. ఈ పూజా కార్యక్రమానికి సంగారెడ్డి మునిసిపల్ వైస్ చైర్మన్ ఆర్‌వీ గోవర్ధన్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.